# మొసాంబ్రమ్

అగడు దునియా

అజ్జకారి దునియా

దీనికిప్పుడు వుడిగినాయన్నీ

యాష్టకొస్తుంది

చెల్లమల్ల చెల్లమల్ల చెల్లమల్ల

కాగుతుంది కడుపూ దాని కన్నూ

వాసనేస్తుంది చీకటి గూడా

కంపుగొడ్తుంది

మాటల వాసనలో

డాలర్ వాసన

రాతల వాసనలో

వెబ్బుల వాసన

చరాచరమంతా ఇంగువ వాసన

మెదడు లోపల పొంగు

అమ్మతల్లి పొంగు

పొక్కులు పొక్కులు

కతలల్లో పొక్కులు బొబ్బలెక్కిన ప్రేమలు

పిలగో...

నాదికాని నాల్క కింద నానుతున్నాను

నాపై కురిసే వాన కూడా ఎవ్వన్దో ఏమో

మూత్రం వాసనేస్తుంది

పంచేంద్రియాలూ పొలోపొలి

దాసరి లచ్చక్కా
తొవ్వ తొలిగిందే
గువ్వ మలిగింది
వొక రహస్యం పగిలిపోయి
గుడ్లెలవెట్టింది

వెలుతురుకిప్పుడు ఎన్ని దిక్కులో
మొక్కంద్రి రా... ఇక మొక్కంద్రి
ఏ దిక్కుకైనా మొక్కంద్రి
ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాసనేస్తున్నాడు
దేవుడు స్ప్రే కొట్టుకున్నాడు
మల్లా సచ్చిపోయిండు

కుతి... కుతి... రాతలకుతి
లేని వచనంలో
నేను లేని కథనంలో వాంతి
గోడలింకా రంగుల్లో రెపరెపలాడుతున్నాయ్
తాకగానే మొలుస్తున్నాయ్
ఇంటెనకాలకి పోంద్రి బిడ్డా
పిలగాండ్ల దగ్గరికి పొంద్రి
పొద్దుగూకినంక పారాడే ఆడోల్ల
ముచ్చట్ల దగ్గరికి పోంద్రి

ఇక కుట్రలెక్కడో లేవు
నాలోనే...
నా వెనుక జోబులోనే

విగ్రహాలకు దండంబెడుతున్నాయ్

వాటి పాదాలను నాకుతున్నాయ్

కథలల్లుతున్నాయ్

ఈ దుఃఖం చేదు

సుఖం చేదు

చావురతి చేదు ఈ వేకువ చేదు

ఈ పూలూ బియ్యం

మందూ మాకులూ కోడితొడలూ

వాటి హార్మోన్ పెదవుల ముద్దుల తడీ

అంతా చేదు

ఆ... క్... థూ...

దీనికంటే మా అమ్మ

తన పాయికి రుద్దిన మొసాంబ్రమే తీపి

బైరూపులోడా

గొల్ల గంగన్నా

చిత్తారీ... నా ప్రియుడా

వింటున్నావా

సిద్ధార్థ

09.04.2001